హంతకులొస్తారు జాగ్రత్త!

ఏ. వీ. మోహన్రావ్

రజనీకాంత్ తలుపు నెట్టుకొని లోనికెళ్ళాడు. ఎదురుగా తనకు ఒక పరిచితమైన పెద్ద గదిద్వారం. తలుపులు మూసుకుని వున్నాయి. పైభాగాన ఎర్రటిలైటు వెలుగుతూంది.

"మార్నింగ్ మిస్టర్ కాంత్" టైపు చెయ్యడం ఆపి విష్ చేసింది మేరీ.

"మార్నింగ్ మిస్ మేరీ!" అన్నాడు వచ్చి ఆమె కదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ కాంత్.

"హౌ యీజ్ లైఫ్!"

"వెరీవెరీ డల్!"

"రియల్లీ! నువ్వెప్పుడూ అందమైన అమ్మాయిల మధ్య మునిగి తేలుతుంటావని చాలామంది అంటూంటారు. మరీ

డల్ సెన్ ఎందుకుంటుంది.''

''నువ్వెందుకంగా లేవా?''

''ఏమో! నాకేం తెలుసు.''

''బాత్ రూంలో నీకేసి నువ్వెప్పుడూ చూసుకోలేదా?''

''యూసిల్లీ!'' అంది నవ్వుతూ తలొంచుకుని మేరీ.

''నువ్వెప్పుడైనా నాతో వచ్చావా?''

''నన్నెప్పుడైనా రమ్మన్నావా?''

''అయితే ఇవాళ రా.''

''ఇవాళా! వండర్ ఫుల్! నిన్ను అర్జంటు పనిమీద పిలిపించాడు బాస్. బహుశా ఇంకో గంటలో నువ్విదేశం దాటి పోవల్సి వుంటుందని నా అనుమానం. ప్రాణాలతో తిరిగొస్తే ఇన్వయిట్ చెయ్యి మళ్ళీ వస్తాను.''

ఎర్రలైటారి పోయింది.

మేరీ ఇంటర్ కమ్ రింగ్ చేసింది.

అవతలవేపునుండి ''యస్!'' అంటూ మ్రోగింది బాస్ కంచుకంఠం.

''మిస్టర్ కాంత్ ఈజ్ వెయిటింగ్!'' అంది మేరీ.

''సెండ్ హిమ్ ఇన్!'' అని ఫోను పెట్టేశాడు.

''మీరు వెళ్ళొచ్చు'' అంది కాంత్ ను, తను గూడా రిసీవర్ను క్రేడిల్ పైన పడేస్తూ.

కాంత్ తలుపు త్రోసుకుని లోనికెళ్ళాడు. విశాలమైన రోజ్ వుడ్ టేబుల్. దానివెనుక ఎత్తయిన కుర్చీ. అందులో నేవీబ్లూ సూట్ లో కూర్చుని వున్నాడు. ఆయన వెనుకవేపు నున్న గోడకు పెద్ద ప్రపంచ పటం వ్రేలాడుతోంది. అక్కడక్కడా పటంలో ఎర్రటి ఇండికేటర్లున్నాయి.

''ప్రొఫెసర్ ప్రేమనాథ్ డోగ్రే పేరెప్పుడైనా విన్నావా కాంత్?'' అడిగాడు బాస్.

"లేదనుకుంటాను!" అంటూ కూర్చున్నాడు కాంత్.

"అతనో పెద్ద సైంటిస్టు. ఇరవయ్యవ శతాబ్దంలో మన దేశంలో పుట్టిన మహామహుల్లో ఒకడు. పాతిక సంవత్సరాలు కృషి చేసి అతను ఉప్పునీటినుండి పెట్రోలు, డీజిల్, ఫర్నేస్ ఆయిల్ లాంటి ఇంధనాల్ని తయారుచేసే ఫార్ములాను కనిపెట్టాడు" ఆగాడు బాస్.

మినీ కరోనాల పాకెట్ తెరచి అందులోంచి ఒక సిగార్ వెలుపలకు లాగాడు. అగ్గిపుల్లతో చిన్న రంధ్రంచేసి, ఆ వైపు నోట్లో పెట్టుకొని వెలిగించాడు.

కాంత్ కు చుట్టవాసన గిట్టదు. దగ్గొచ్చింది. బాస్ ముందు దగ్గడం బాగుండదని తమాయించుకున్నాడు.

"అతన్ని ఎవరో అంతర్ధానం చేశారు."

"మైగాడ్!"

"అతని ఫార్ములా మన ప్రభుత్వానికి ఇవ్వకముందే ఇది జరిగింది. పోలీసులు మూడు మాసాలపాటు అతని కేసు దర్యాప్తు చేసి లాభంలేక విరమించుకున్నారు. ఆ తర్వాత సి. బి. ఐ. నెలరోజులపాటు ప్రయత్నంచేసి, ఇది మామూలుగా జరిగే నేరాల్లాంటిది కాదనీ, ఏదో విదేశీ గూఢచారి ముఠాపనయి వుండాలని అభిప్రాయపడింది. వెంటనే కేసును మనకు రెఫర్ చేశారు."

"అంటే అతను అంతర్ధానమై ఆరునెలలయిందా?"

"దాదాపుగా అయింది. దేశదేశాల్లో వున్న గూఢచారుల్ని వెంటనే హెచ్చరించాం. మన శత్రుకూటమి ఏజంట్లలో ఏదో కొత్త ఉత్సాహం కనపడుతూందని పరిస్తాన్ లో వున్న ఏజంటు రిపోర్టు పంపాడు. ఆ తర్వాత ఇరవై నాలుగు గంటలలో అతను కారాక్సిడెంటులో చనిపోయాడు. మనకున్న ఒకే ఏజంటక్కడ. వెంటనే మరో ఏజంటును పంపాను. వారం దినాలు పూర్తిగాకముందే అతన్నిగూడా మట్టు

బెట్టారు" అన్నాడు బాస్.

"ఆ మొదటి ఛాన్సు నా కివ్వవలసింది బాస్!" అన్నాడు కాంత్.

"నేను ఇది సులభంగా పరిష్కారమవుతుందనుకున్నాను" అన్నాడు బాస్.

"మేరీ నీకు అన్నీ వివరంగా చెబుతుంది. అక్కడ మనకు నమ్మకమైనవాళ్ళ అడ్రసులు ఇస్తుంది. నువ్వు వెంటనే పరిస్తాను వెళ్ళు. అవసరమైతే జార్జినికూడా తోడు తీసుకెళ్ళు."

"ఆల్ రైట్! వస్తాను బాస్!" అన్నాడు లేస్తూ.

"అవతలి వాళ్ళు అసాధ్యులు. నువ్వు ప్రాణాలతో తిరిగి రావాలి! జాగ్రత్త!" అన్నాడు బాస్.

"నేను ప్రాణాలతో రాకున్నా, డోగ్రేని ప్రాణాలతో పంపుతాను. విష్ మీ ఆల్ ది లక్!" అన్నాడు కాంత్.

"విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్! మైసన్!" అంటుంటే ఆయన కళ్ళు ఆర్ద్రమైనాయి.

2

విమానం ఏర్‌పోర్ట్‌లో ఆగింది.

కాంత్ దిగాడు. వెనకాలే జార్జి కూడా దిగాడు.

ఇద్దరివద్దా ఆయుధాలేవీలేవు. వాళ్ళ దగ్గరున్న బాండ్ కేసుల్లో వాళ్ళకు సంబంధించిన వీసాలు, కాగితాలు వున్నాయి. విజటర్సు లాంజ్‌లో కడుగు బెట్టారు.

పరిస్తాన్ ముస్లిం దేశం కావటంతో అక్కడున్న ఆడవాళ్ళంతా పరదాల్లో వున్నారు. తెల్లటి పాదాలు చేతులు తప్ప మరేమీ కన్పించటంలేదు.

తమనెవరైనా పరిశీలిస్తున్నారేమో తెలుసుకుందామని ప్రయత్నించారు. ఎవరిగొడవల్లో వాళ్ళున్నట్లనిపించింది. కానీ

పరదాల వెనుకనున్న స్త్రీలెవ్వరయినా తమను చూస్తున్నా గుర్తించే అవకాశంలేదు.

కాంత్ వెలుపల కొచ్చాడు. టాక్సీని పిలిచి ఎక్కాడు. జార్జి గూడా లోనికి దూకాడు.

"హోటల్ ఆల్మండ్!" అన్నాడు.

టాక్సీ రివ్వున దూసుకుపోయింది. ఇరవై నిముషాల్లో టాక్సీ హోటల్ చేరుకుంది. ఫేర్ చెల్లించి ఇద్దరూ దిగి రిసెప్షన్ కౌంటర్ ముందుకు వెళ్ళారు. కాంత్ పేరు చెప్పగానే "రూం నెంబరు మూడ్వొందలా మూడు మీకు రిజర్వు చేసి వుంచాం!" అన్నాడు.

హోటల్ భాయ్ కేస్ తీసుకుని ముందునడిచాడు. ఇద్దరూ అతన్ని అనుసరించారు.

ఎలివేటర్ ఆర్లో అంతస్తులో ఆగింది. ముగ్గురూ దిగారు. దిగి, కుడివేపునున్న మూడో రూం తలుపులు తెరిచాడు భాయ్. కాంత్, జార్జి లోనికి దూరారు. విశాలంగా వుంది గది. అన్ని సౌకర్యాలు వున్నాయి.

"మీకేమైనా కావాలా సార్!" అడిగాడు భాయ్.

"అవసరంలేదు!" అన్నాడు కాంత్.

భాయ్ వెళ్ళిపోయాడు. కాంత్ తలుపులుమూసి లోపలి నుండి లాక్ చేశాడు. హిప్ పాకెట్ లోంచి స్క్రూ డ్రైవరు తీసి ఎయిర్ కండిషన్ ప్లాంటు విప్పాడు. తమ సంభాషణ వినేందుకు ఏదైనా మైక్ అందులో బిగించారేమోనని అతని అనుమానం. అలాంటిదేమీ అతనికి కనిపించలేదు.

అనుమానమున్న ప్రతివస్తువూ పరిశీలించాడు! ఆ తర్వాత అన్నీ యథాతథంగా సర్ది ఏ. సీ. ప్లాంటు ఆన్ చేశాడు.

"మన కార్యక్రమ మేమిటి?" అడిగాడు జార్జి.

"నువ్వు కడుపునిండా తిని పడి దొర్లుతూండు. నాకు

రెండు చిన్న పనులున్నాయి. చూసుకొని వస్తాను" అన్నాడు కాంత్.

"నాతో అవసరం లేదా?"

"ప్రస్తుతం లేదు. అవసరముంటే ఫోన్ చేస్తాను. రా!"

మాట్లాడుతూనే డ్రస్ చేసుకున్నాడు కాంత్. ఈల వేసుకుంటూ రూంలోంచి వెలుపలికొచ్చాడు. మెట్లుదిగి హోటల్ బైటపడ్డాడు. టాక్సీ ఆపి ఎక్కాడు.

"కిదర్ జానా!" అడిగాడు డ్రైవరు.

"మక్కా మసీద్!" చెప్పాడు.

టాక్సీ దూసుకుపోతూంటే, కిటికీలోంచి కదిలిపోయే జనాన్ని, అంగళ్ళను చూస్తూ కూర్చున్నాడు.

ఇరవై నిముషాల ప్రయాణం తర్వాత, టాక్సీ పెద్ద చలువ రాతి భవనం ముందాగింది.

టాక్సీ డ్రైవరుకు డబ్బిచ్చి దిగాడు. కారువదిలి వెళ్ళిందాకా అక్కడే నిలబడ్డాడు. ఆ తర్వాత తన్నెవరైనా గమనిస్తున్నారేమోనని చుట్టూచూశాడు. ఎవ్వరూ తనను పట్టించుకోవడం లేదని నిర్ధారణ చేసుకున్నాక మాస్క్ లోకి దూరాడు.

బూట్లువిప్పి ఒక వారగా పడేశాడు. లోపలకు వెడుతుంటే ఒక సాయిబు ఎదురైనాడు. కాంత్ కేసి వింతగా చూశాడు.

"మాల్వీ మస్తాన్ సాబ్ హోనా!" అన్నాడు వచ్చీరాని హిందీలో.

"అందర్ హై! సీదా జాయి యే!" అన్నా డతను.

కాంత్ తిన్నగా లోనికి వెళ్ళాడు. పొడవుపాటి తెల్లటి గడ్డంతో ఖొరాన్ చదువుకొంటూ కూర్చున్న వ్యక్తినిచూసి అతనే తనకు కావలసిన వ్యక్తయి వుంటా డనుకున్నాడు. దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు.

"ఆదాబ్!" అన్నాడు కాంత్.

మాల్వీ తలెత్తి చూశాడు.

"నాపేరు కాంత్. నా నెంబరు మూడువందల మూడు" అన్నాడు.

మాట్లాడ వద్దన్నట్లు సంజ్ఞ చేశాడు మాల్వీ. వెంటనే అక్కడ్నుంచి లేచి, కాంత్ ను తనవెంట రమ్మన్నట్లు సంజ్ఞ చేశాడు.

ఇద్దరూ మేడ మెట్లెక్కి పైనున్న గదిలోకి వెళ్ళారు. మాల్వీసాబ్ గదితలుపులు మూశాడు.

"మీ బాస్ నిన్ను పంపుతున్నట్లు మెసేజ్ ఇచ్చాడు. మీరన్నా, మీదేశమన్నా నాకు అంతులేని గౌరవం. నేను అక్కడే పుట్టి పెరిగాను. పరిస్థితుల ప్రభావంవల్ల ఇక్కడికి వచ్చేశాను" అన్నాడు మాల్వీ.

"మా సైంటిస్టును కొంతమంది దుండగులు బంధించి తెచ్చిన వైనం తెలుసనుకుంటాను. మా ఏజంట్లు ఇద్దరు వాళ్ళ చేతుల్లో హతమైన విషయంగూడా మీకు తెలుసనుకుంటాను" అన్నాడు కాంత్.

"తెలుసు. మీ రెండో ఏజంటు దారుణంగా హత్యగావించబడ్డాడు. అతనుగూడా నావద్దకువచ్చి వెళ్తూండేవాడు. పనికన్నా ఎక్కువ ఆడపిల్లల్ని వేటాడడంలో నిమగ్నమైనాడు. చివరకు ఆ గొడవల్లోనే హత్యకాబడ్డాడని అనుకునేలా తెలివిగా హత్యచేశారు వాళ్ళు."

"నాకా హత్య వివరాలు కావాలి!" అన్నాడు.

"ఇస్తాను. ఇంకేమన్నా కావాలా?"

"నాకో మంచి రివాల్వరు కావాలి. మీరు ఏర్పాటు చెయ్యగలరా?"

"చేస్తాను" అంటూ మూలనున్న అల్మైరా తెరచి, అందులోంచి ఒక పెద్ద కవరు, ఒక వెప్సన్ ఆటోమేటిక్ రివాల్వరు అందించాడు.

"ఆ కవర్లో, నేను ఇంతదాకా సంపాదించిన వివరాలున్నాయి. జాగ్రత్తగా చదువుకో! ఉపయోగపడతాయి" అన్నాడు మాల్వీ.

"థాంక్స్!" అంటూ లేచాడు కాంత్.

"మిస్టర్ కాంత్! మీ ప్రత్యర్థులు అఖండులు. నెత్తురు తాగేపిశాచాలు. వాళ్ళతో జాగ్రత్తగానే గాదు, దయా విహీనంగా ప్రవర్తించాలి. అప్పుడే నువ్వు విజయం సాధిస్తావు. ఇక్కడి ప్రభుత్వం, వాళ్ళకు మద్దతు ఇస్తుందని నేననుకోను. అలాగే నిన్నూ సమర్థించదు. నీకు ప్రభుత్వ సహాయమేమీ లభించదు. అవకాశం చిక్కితే నిన్ను వాళ్ళు అరెస్టు చేసేందుకూడా వెనుకాడరు. కాబట్టి జాగ్రత్త!" హెచ్చరించాడు మాల్వీ.

"ఫరవాలేదు! అవసరమైతే మళ్ళీ వస్తాను" అన్నాడు కాంత్.

3

గ్లాసునిండా విస్కీ పోసుకున్నాడు వాల్టర్. ఆనందంలో అతనికళ్ళు మెరుస్తున్నాయి.

తను ప్రేమనాథ్ డోగ్రేను ఎంతో తెలివిగా మాయం చేసుకొచ్చాడు. అతనికోసం ఇండియన్ గవర్నమెంటు చేస్తున్న ప్రయత్నాలన్నింటినీ, మొగ్గలోనే తుంచివేయ గలిగాడు.

అయినా అవతలవాళ్ళు అంతటితో ఆగరని తెలుసు. ఈ మారు ఇంకా తెలివైన గూఢచారిని పంపుతారు. అతన్ని గూడా తను మట్టుబెట్టకలగాలి. డోగ్రేనుండి నిజం కక్కించేయాలి.

విస్కీ గొంతులో పోసుకున్నాడు.

తనక్రింద పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులు గుర్తుకొచ్చారు.

ఇద్దరూ పచ్చినెత్తురు త్రాగే పిశాచంల్లాంటివారు. చంపడం వాళ్ళకు హాబీ. చంపాక సీసాలకు సీసాలు ఖాళీచేసి పడి దొర్లడం అలవాటు. వాళ్ళిద్దర్నీ అదుపులో పెట్టుకొని ప్రత్యర్థుల పన్నాగాలు పసిగడుతూ, ఎదురు ఎత్తులువేసే వహీద్ తనకు కుడిభుజం. వహీద్‌కు పరిస్తాన్ ప్రభుత్వపు పెద్ద అధికారుల్లో విపరీతమైన పలుకుబడివుంది. అందువల్లే తమ ఆటలు సాగుతున్నాయి.

మరోగ్లాసు విస్కీ పుచ్చుకొన్నాడు. లేచి వెళ్ళి మూల నున్న టెలిఫోన్ రిసీవరు పైకెత్తి నెంబరు డయల్ చేశాడు.

"వహీద్ స్పీకింగ్!" అవతలవేపునుండి వినొచ్చింది.

"కపూర్ హియర్! ఏదైనా క్రొత్త బలగం దిగిందా?" అడిగాడు.

"తెలీలేదు బాస్! ఇండియానుండి వచ్చే విమానాల్లో దిగిన పాసింజర్ల లిస్టులు తెప్పించాను. అందులో ఇద్దరిపేర్లు మాత్రం అనుమానాస్పదంగా కనుపిస్తున్నాయి. వాళ్ళు హోటల్ ఆల్మండ్‌లో దిగారు."

"రూం నెంబరెంత?"

"మూడొందలా మూడు బాస్!"

"వాళ్ళ సంగతి నాకొదిలెయ్యి."

"అలాగే బాస్! బేగం జరీనా సంగతి ఏంచేద్దాం. ఆమెను సఫా చేయించటం మంచిదనిపిస్తుంది" అన్నాడు వహీద్.

"వద్దు! ఆమెద్వారా మనం క్రొత్త ఏజంట్లు రంగంలో దిగితే పట్టుకోవచ్చు. ఆమె జోలికి పోవద్దు!" అన్నాడు.

జరీనా బేగం, అంతకుముందు హాత్యకాబడ్డ ఇండియన్ ఏజంట్ సునీల్‌ని ప్రేమించింది. సునీల్ కూడా ఆమెను ప్రేమించాడు. ఆమె పేరుపయోగించే అతన్ని ఊరవతలికి రప్పించి, అక్కడ హాత్యచేశాడు వహీద్.

"అయితే నన్నేం చెయ్యమంటారు?"

"నేను మళ్ళీ ఫోన్ చేసిందాకా ఇంట్లోనే వుండు. రెండు మూడు పనులున్నాయి చక్కబెట్టుకొని వస్తాను" అంటూ ఫోన్ కట్ చేశాడు.

సీసాలోవున్న మిగిలిన విస్కీ తీసుకొని, ఒక్కసారిగా గొంతులో పోసుకున్నాడు. బాటిల్ విసిరి డస్ట్‌బిన్‌లో కొట్టి, మేడ దిగి క్రిందికొచ్చాడు. క్రింద పార్కింగ్‌లో వున్న పాంటియాక్ కారెక్కి, స్టార్ట్ చేశాడు.

కారు నగరంలోని రోడ్లను దూసుకుంటూ వెళ్ళసాగింది. అరగంట తర్వాత ఊరుదాటింది. నాలుగుమైళ్ళు పోయాక కుడివేపు త్రిప్పాడు. కొంతదూరం గతుకుల్లోపడి పోయింది. తర్వాత ఒక పాడుబడ్డ బంగళాముందు ఆగింది.

కారును చూస్తూనే ,వాచ్ మెన్ తలుపులు తెరచి విష్ చేశాడు.

వాల్టర్ కారును లోనికి పోనిచ్చాడు. పోర్టికోలో కారాపాడు. దిగి లోనికెళ్ళాడు. అక్కడో నలుగురు సాయుధులైన వ్యక్తులున్నారు.

"సబ్ ఠీక్ హై!" అడిగాడు వాల్టర్.

"ఠీక్ హై సాబ్!" చెప్పారు వాళ్ళు.

మెట్లుదిగి భూగర్భంలోవున్న గదిలోకి వెళ్ళాడు.

పక్కి మంచంపైన కూర్చునివున్న డాక్టర్ గ్రే, వాల్టర్‌ను చూడగానే తల త్రిప్పుకున్నాడు.

"మార్నింగ్ ప్రొఫెసర్!" అన్నాడు వాల్టర్.

డాక్టర్ గ్రే మౌనంగా వుండిపోయాడు.

"నిన్ను రక్షించాలని వచ్చిన ఇద్దరు ఏజంట్లు నా చేతుల్లో హతమైపోయారు. నిన్ను రక్షించడం ఎవ్వరి తరంగాదు. నువ్వు సాధించిన ఫార్ములా మాకు చెప్పు. కోటి రూపాయలు ఖరీదుచేసే బంగారమిస్తాను. నిన్ను వెంటనే మీదేశం పంపు

తాను" అన్నాడు వాల్టర్.

"ఈ బొందెలో ప్రాణంవుండగా అది జరగదు. చచ్చేందుకైనా సిద్ధమే!" అన్నాడు.

"నిన్ను మామూలుగా చావనివ్వను. చిత్రహింస పెడతాను. చర్మం చెక్కేస్తాను. ఒక్కొక్క కండ వొలిపిస్తాను. ఒక్కొక్క ఎముక ఊడగొడతాను. ఆ బాధను తట్టుకోలేక నువ్వే నిజం చెబుతావు" అన్నాడు వాల్టర్.

డోగ్రే ఏమీ మాట్లాడలేదు.

"నిన్ను రెండు దినాల్లో ఇక్కడినుండి మరో దేశానికి తరలించే ఏర్పాట్లు చేస్తాను. అక్కడే మావాళ్ళు నీ అంతు కనుక్కుంటారు. ప్రయాణానికి సిద్ధంగావుండు. ఆ విషయం చెప్పేందుకే వచ్చాను" అన్నాడు వాల్టర్.

డోగ్రే మాట్లాడకుండా మంచంపైన కూలబడ్డాడు.

వాల్టర్ వెనక్కి తిరిగి వచ్చేసి, తను చేసిన సెక్యూరిటీ ఏర్పాట్లన్నింటినీ అక్కడున్న కాపలావాళ్ళతో కొంతసేపు తర్కించాడు.

అంతా సవ్యంగా వుందని నిర్ధారణ చేసుకొన్నాక, బయలుదేరాడు కారులో వెనక్కి.

4

వాల్టర్ కార్ను సుల్తాన్ రోడ్ లోకి తిప్పాడు. ఆరో నెంబరు ఇంటిముందు కారాపాడు. లోపల కూర్చునే రెండు వేపులా చూశాడు.

ఆరో నెంబరు ఇల్లు చిన్నదే. జరీనా అందులోనే వుంటుంది. ఆ యింటికెదురుగా రోడ్డు అవతల చిన్న హోటలుంది.

జరీనా ఇంటికేసి ఎవ్వరూ చూడడంలేదన్న నమ్మకం కుదిరాక కారులోంచి దిగాడు,

తిన్నగా వెళ్ళి తలుపుతట్టాడు.

"ఎవరది?" లోపలనుండి ఆడగొంతు వినిపించింది.

"నేను. నీకు హితుణ్ణి. మేలుగోరేవాణ్ణి. తలుపుతీ" అన్నాడు వాల్టర్.

"తియ్యను. నువ్వెళ్ళిపో!" అంది జరీనా.

"అలాకాదు! నువ్వు పెద్ద ఆపదలో వున్నావు. నీ ప్రాణాలు తీసేందుకు కొందరు దుర్మార్గులు సిద్ధంగావున్నారు. వాళ్ళనుండి కాపాడకంకోసం వచ్చాను. తలుపు తీ!"

"నువ్వు పోలీసువా?"

"అఁ!"

"నాకు నమ్మకమేమిటి?"

"నీదగ్గరేదైనా రివాల్వరుగానీ, కత్తిగానీ వుందా?"

"కత్తివుంది."

"దాన్ని చేత్తోపట్టుకుని తలుపుతీ. నేను రెండుచేతులు పైకెత్తి పట్టుకుంటాను. నీకు అనుమానం రాగానే కత్తితో నన్ను పొడవచ్చు."

"నేను ఆడదాన్ని. నిన్ను పొడిచేలోపల నువ్వే నన్ను పొడుస్తావ్."

"అలాంటిదేమీ జరుగదు. నన్ను నమ్ము. తలుపు తీ. ఇలా వీధిలో నిలబెట్టి ఒక పోలీసాఫీసరుతో మాట్లాడడం మర్యాదగాదు" అన్నాడు వాల్టర్.

జరీనా తలుపులు తెరచింది.

వాల్టర్ లోనికొచ్చాడు. దూరంగావున్న సోఫాలో వెళ్ళి కూర్చుంది. గుమ్మంప్రక్కనేవున్న సోఫా చూపించింది వాల్టర్‌ను కూర్చోమని.

ఆమె అందంచూచి అతనికి మతిపోయింది.

గుండ్రటి మొఖం, విశాలమైన కళ్ళు, పొడవైనముక్కు, చిన్ననోరు, ఎర్రని పెదాలు, గుండ్రటి మెడ, నల్లటి చీర

వెనుకనుంచి తెల్లటి ఆమె శరీరం మిలమిల మెరసిపోతోంది. ఆమె సన్నటి శరీరానికి వుండవలసిన ప్రమాణంకన్నా కాస్త పెద్దవిగానే వున్న రొమ్ములు.

ఆమెని చూడగానే వాల్టర్‌కు, వొళ్ళు వేడెక్కింది. అయినా తమాయించుకున్నాడు.

"సునీల్‌కుమార్‌ను నువ్వు ప్రేమించావా?"

"ఆఁ!"

"అతను చనిపోయాడుగదూ!"

"లేదు! ఎవరో హత్య చేశారు."

"ఎవరో నీకు తెలుసా?"

"తెలీదు!"

"తెలుసుకోలేవు. నేను చెపుతాను విను. అతను గూఢచారి. ఇండియన్ గవర్నమెంటు తరఫున పనిచేస్తున్నాడు. అతని ప్రత్యర్థులు మరోదేశపు గూఢచారులు అతన్ని మట్టుపెట్టారు. వాళ్ళు శత్రుశేషం వుంచుకోవడం ఇష్టంలేదన్నట్లు సునీల్‌కుమార్‌తో స్నేహంగావుండిన మరో ఇద్దర్ని గూడా చంపారు. ఇది మా నోటీసుకొచ్చింది. అప్పుడే నీ విషయం తెలిసింది. ఆ హంతకులు నిన్ను చంపేందుకు కూడావస్తారు. జాగ్రత్తగా వుండమని హెచ్చరించిపోదామని వచ్చాను" అన్నాడు వాల్టర్.

"అలాగా! సారీ! మిమ్మల్ని, నన్ను చంపేందుకు వచ్చిన విరోధికూటమి వాళ్ళేమోనని భయపడిపోయాను" అంది.

"ఆ పరిస్థితుల్లో ఎవరైనా అలాగే అనుకుంటారు. డోంట్ వర్రీ."

"అయితే నన్నేం చెయ్యమంటారు."

"నీకోసం, బహుశా' ఇవాళో, రేపో ఆ హంతకులు రావచ్చు. నీతో మాట్లాడాలంటారు. నువ్వు వాళ్ళకు అవకాశం యివ్వవద్దు. అర్జంటుపనిమీద వున్నానని, ఆ తర్వాత

ఫోన్ చేసి అపాయింట్ మెంట్ ఫిక్స్ చేస్తానని చెప్పా. ఈలోగా నేను రెండుగంటలకొకసారి ఫోన్ చేస్తాను. మనిద్దరం మాట్లాడుకొన్నాక అపాయింట్ మెంట్ ఇవ్వు. వాళ్లు వచ్చేందుకు ముందుగానే ఇద్దరు పోలీసుల్ని ఇక్కడకు పంపుతాను. ఆ దుర్మార్గుల్ని రాగానే అరెస్టుచేసి తీసుకుపోతారు. ఓ. కే!'' అడిగాడు వాల్టర్, తన తెలివితేటలకు తనే మురిసిపోతూ.

''అలాగే చేస్తాను. నాకోసం మీరింత శ్రమపడుతున్నందుకు చాలా థాంక్స్!'' అంది జరీనా.

''వస్తాను'' అంటూ లేచాడు వాల్టర్.

జరీనా కూడా లేచివెళ్ళి మెట్లదాకా సాగనంపింది. వీధిలోవున్న కారుకేసి చూసింది. అది పోలీసుకారులా లేదు. మామూలుగా అందరూ వాడుకునే కారులా తోచింది. ఒక వేళ మారువేషంలో తిరుగుతున్నాడేమోలేనని సర్ది చెప్పుకుంది జరీనా.

లోనికివెళ్ళి తలుపులు మూసుకుంది.

5

కాంత్ టాక్సీ దిగాడు.

అంతకుముందే కదలిపోయిన వాల్టర్ కారును అతను గమనించలేదు. మాల్వి ఇచ్చిన కాగితాల్ని చదువుకుంటూ కూర్చోవడంతో అతనికి ఎక్కడికి వచ్చిందికూడా అర్థంగాలేదు.

''ఆగయా సాబ్!'' అన్నాడు డ్రైవరు వెనక్కి తిరిగి.

కాంత్ కాగితాల్ని మడిచి లోపల బెట్టుకొని కారు దిగాడు. తిన్నగా ఆరో నెంబరు ఇంట్లోకి అడుగుబెట్టి బజర్ నొక్కాడు.

''ఎవరది? అంది జరీనా లోపల్నుండి.

"నేనే!" అన్నాడు కాంత్ రహస్యంగా.

"ఇప్పుడేగా వెళ్ళారు! అప్పుడే వచ్చారేం? ఏదైనా మరచిపోయారా?" అడిగింది జరీనా.

"ఆఁ!" అన్నాడు ఎలాగైనా ఆమెచేత తలుపు తీయించాలన్న వుద్దేశంతో.

జరీనా తలుపు తెరచింది. ఎదురుగుండా కనుపించిన క్రొత్త వ్యక్తిని చూచి బిక్కచచ్చిపోయింది. రక్కున తలుపు మూయ్యబోయింది.

ఆమె అలా చేస్తుందని ముందే ఊహించిన కాంత్ కుడి కాలు గుమ్మం అవతల పెట్టాడు. దాంతో తలుపు సగంలోనే ఆగిపోయింది. జరీనా శక్తంతా ఉపయోగించింది తలుపు మూసేందుకు. కానీ కాంత్ కాలు అదిమిపెట్టి, రెండో కాలు గూడా లోనికి తీసుకున్నాడు. ఆమెను దూరంగా నెట్టాడు.

జరీనా వెళ్ళి సోఫాలో పడింది.

కాంత్ తలుపులు మూశాడు.

"నన్ను చంపొద్దు! నాకేమీ తెలీదు" అంది జరీనా భయపడిపోతూ.

"కూర్చో! నిన్ను చంపేందుకు రాలేదు నేను. ఎవ్వరూ చంపకుండా కాపాడేందుకు వచ్చాను" అన్నాడు కాంత్ కుర్చీలో కూర్చుంటూ.

"అబద్ధం! ఇంతకుముందే పోలీసుఆఫీసరు వచ్చిపోయాడు. అతను చెప్పినట్లే నువ్వు వచ్చావ్. వెళ్ళు! ప్లీజ్!" అంది జరీనా.

"నేను నీకు హితుణ్ణి. నన్ను నమ్ము. నువ్వు ప్రేమించిన సునీల్ కుమార్‌తో పాటు పనిచేసే ఇండియన్ ఏంజటుని. అతన్ని చంపినవాళ్ళను చంపేందుకు వచ్చాను. నాకు నీ సాయం కావాలి" అన్నాడు కాంత్.

"ఇప్పుడు నేనేమీ మాట్లాడలేను. నాకు త్వరగా వెలు

పలికి పోవాల్సిన పనివుంది. మీ ఫోన్ నెంబర్ యివ్వండి. నా వీలు చూచుకుని మీకు ఫోన్ చేస్తాను. అప్పుడురండి'' అంది జరీనా.

''ఐదు నిముషాలు మాట్లాడు చాలు. నా ప్రశ్నలకు సమాధానం చెప్పు.''

''లాభంలేదు. నేను వెళ్లాలి!''

''నిన్ను వెళ్ళనివ్వను. నా ప్రశ్నలకు జవాబులు చెప్పి తీరాలి.''

''వీల్లేదు. నే కెళ్ళాలి!'' అంది జరీనా మొండిగా.

కాంత్ రివాల్వరు తీసి భయపెడదామని జేబులో చెయ్యి పెట్టాడు. జరీనా మనిషి మొత్తం వణికిపోవడం గమనించాడు. తన ప్రయత్నం మానుకున్నాడు.

ఆమెకు తను ఆమె హితుడన్న నమ్మకం కలిగించడం అవసరమన్న ఆవశ్యకత అర్థమైంది.

''ఆల్ రైట్! నీ యిష్టం వచ్చినట్లు చెయ్యి. రూం నెంబరు మూడొందలామూడు. హోటల్ ఆల్మండ్. మిస్టర్ కాంత్ కావాలని అడుగు. ఒక్కటిమాత్రం గుర్తుంచుకో. నేను మళ్ళీ నిన్ను కలుసుకో నేలోపల నీకు ప్రమాదం సంభవించే అవకాశముంది'' అన్నాడు కాంత్.

''నాకేం భయంలేదు. నా ఫోన్ కోసం ఎదురుచూడండి. అప్పుడు మీకంతా వివరంగా చెపుతాను'' అంది జరీనా.

''అలాగే! వస్తాను'' అంటూ వెలుపలకు నడచాడు కాంత్.

టాక్సీ ఎక్కి హోటల్ ఆల్మండ్ కు పోనిమ్మని చెప్పాడు.

అతనికి జరీనా ప్రవర్తన కాస్త వింతగా తోచింది. ఆమె మాటల్నిబట్టి అంతకుముందే ఎవరో వచ్చి వెళ్ళినట్లు స్పష్టమైంది. తన ప్రత్యర్థులయివుండాలి బహుశా. వాళ్ళకు తెలుసు తను ఆమెను కలుసుకుంటాడని. తనకన్నా ముందా

మెను వాళ్ళు కలుసుకుని హోటల్లో మధ్య పెట్టి, తామా మెను రక్షించేవాళ్ళమని చెప్పాలనివుండాలి. తమకు ముందుగా సమాచారం అందజేసి, ఆ తర్వాత తనకోసం సునీల్ కుమార్ హత్యవిషయంలో వాకబుచెయ్యాను వచ్చిన వాళ్ళను కలుసు కోమని చెప్పివుంటారు. అందుకే ఆమె తనను తర్వాత రమ్మంది.

అడబోయిన తీర్థ మెదురయినట్లు ఫీలయినాడు.ఆనందంతో ఈలవేశాడు కాంత్.

ఆల్మండ్ హోటల్ దగ్గర దిగి డబ్బిచ్చి టాక్సీని పంపే శాడు. రూంకు వెళ్ళాడు. జార్జి సుష్టుగాతిని, త్రాగి ప్రక్క మీద దొర్లుతున్నాడు.

"జార్జి! జార్జి!" పిలిచాడు.

"ఏమిటి?" అడిగాడు.

"లేచి డ్రెస్ చేసుకో!" అన్నాడు.

జార్జి చకచక బట్టలు మార్చుకున్నాడు. ఆరంగుళాల ఆటోమేటిక్ నైఫ్ జేబులో పెట్టుకున్నాడు.

"రెడీ బాస్!" అన్నాడు జార్జి.

"సుల్తాన్ రోడ్ లో 65 నెంబరు ఇంటికెదురుగా చిన్న హోటలుంది. నువ్వెళ్ళి అక్కడ కూర్చుని ఆ యింట్లోకి ఎవ రెవరు పోయేది, ఎంతమంది పోయేది, పోయినవాళ్ళు వెలు పలికొచ్చేదీ, లేనిదీ, జాగ్రత్తగా కనిపెట్టుకునివుండు. నేను వచ్చి కలుసుకుంటాను తర్వాత" అన్నాడు కాంత్.

"అలాగే!" అంటూ జార్జి బయటికి వెళ్ళాడు.

6

ఫోన్ మ్రోగింది.

రిసీవరు తీసుకుంటూ గోడగడియారంకేసి చూసింది జరీనా. పన్నెండయింది.

"జరీనా!" అంది.

"నేను పోలీస్ ఆఫీసర్ని మాట్లాడుతున్నాను" అన్నాడు అవతలి వ్యక్తి.

"మీ కాల్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. మీరు అటు వెళ్ళగానే వచ్చాడు ఆగంతకుడు. బలవంతంగా లోని కొచ్చాడు. చంపుతాడేమోనని భయపడ్డాను. అతన్ని తప్పించుకోవడం కష్టమైంది."

"ఏమైనా ప్రశ్నలడిగాడా?"

"అడగాలన్నాడు. నేనే జవాబు చెప్పనన్నాను తర్వాత ఫోన్ చేస్తానని చెప్పాను."

"వెల్ డన్! అయితే అతనికి ఫోన్ చేసి రెండింటికి రమ్మను. ఈలోగా ఇద్దరు పోలీసుల్ని పంపుతాను. అత న్నెలా అరెస్ట్ చెయ్యవలసిందీ వాళ్ళకి వివరించి చెబుతాను. నువ్వు వాళ్లు చెప్పినట్లు చెయ్యి చాలు" అన్నాడు అవ్యక్తి.

"అలాగే! మీరుగూడా రాకూడదూ!"

"ఇది చిన్న కేసు. నాకు వేరే అర్జంటు పనులున్నాయి. నీకేం భయంలేదు. నేను పంపే మనుషులు అంతా చూసు కుంటారు. ధైర్యంగా వుండు" అన్నాడతను.

"అలాగే!" అంది జరీనా.

అవతలివ్యక్తి ఫోన్ పెట్టేశాడు. జరీనాకూడా రిసీవరు క్రేడిల్ పైన పడేసింది.

సునీల్ కుమార్ గుర్తొచ్చాడు. అతను చాలామంచివాడు. అతనితో తన పరిచయం పట్టుమని పదిహేను రోజులన్నా లేదు. తనతన్ని పెళ్ళాడుదామనుకుంది.

తను ఇండియాలోనే పుట్టింది. అక్కడ తన బంధు వులు చాలామంది వున్నారు. వాళ్ళందర్నీ అతనికి తెలుసు. ఎన్నో విషయాలు చెప్పేవాడు. అతన్ని పెళ్లాడి, అతనితో

ఇండియాకు వెళ్ళిపోవాలనుకుంది.

కానీ తన పథకం తారుమారైంది. ఆ రాత్రి అతను తనతో పదింటిదాకా వున్నాడు. తనకు స్వర్గం చూపించాడు. ప్రొద్దున్నే వస్తానని చెప్పాడు. తెల్లారేసరికి అతని కారు ఎలక్ట్రిక్ పోల్‌ను గుద్దుకుందని, అతను చనిపోయాడని వార్తొచ్చింది.

అందరూ అది ఆక్సిడెంటనే అన్నారు. కానీ తను శవాన్ని చూచింది. నడుం క్రింద పిస్తోలు గుళ్లు దూరిన గుర్తులున్నాయి. కారులో అతన్ని చంపి కూర్చోబెట్టి తర్వాత మరో కారుతో అతని కారును ఎలక్ట్రిక్ స్తంభం వైపు బలంగా మోదించారు. పోలీసులతో పోరాడింది. కానీ లాభం లేకపోయింది.

అతను భారతదేశపు గూఢచారనీ, మరేదో గూఢచారి ముఠా చేసిన హత్యయి వుంటుందనీ, గాంగ్లో తాము మామూలుగా జోక్యం చేసుకోమని చెప్పారు పోలీసులు. సునీల్‌ను చంపిన వాళ్ళపై పగతీర్చుకునే అవకాశంకోసం ఎదురుచూస్తూ వుండిపోయింది.

బహుశా తను పోలీసులతో పోరాడిన విధానం వివరంగా సునీల్ హంతకులకు తెలిసి వుంటుంది. ప్రభుత్వంలోని కొందరు పెద్ద అధికారుల్ని తను కలుసుకుందామనుకోవడం కూడా వాళ్ళకు చూచాయగా గుర్తింపుకొచ్చి వుంటుంది. అందుకే తననోరు మూయ్యాలనీ, అందుకే చంపడం మినహా మరోమార్గం లేదన్న నిర్ణయానికొచ్చి, తెగించి ఇంటికొచ్చి వుంటారనిపించింది.

తనకై తనేవచ్చి సాయంచేసేందుకు సిద్ధమైన పోలీస్ ఆఫీసర్ను తలచుకోగానే ఆమెలో కృతజ్ఞత కట్టలు తెంచుకొంది.

ఫోన్ పైనున్న రిసీవరుతీసి హోటల్ ఆల్మండ్‌కు డయల్ చేసింది.

"హోటల్ ఆల్మండ్!" రిసెప్షనిస్టు కంఠం ఖంగుమంది.

"రూం నెంబరు మూడొందలామూడు" అంది జరీనా.

"యస్! రూం నెంబర్ త్రీనాట్ త్రీ" అవతలివేపునుండి వినిపించగానే "మిస్టర్ కాంత్ ప్లీజ్!" అంది జరీనా.

"స్పీకింగ్!"

"ఇందాక మీరు నా దగ్గరకొచ్చారు. నాపేరు జరీనా. మీరు సరిగ్గా రెండింటికల్లా రావాలి. ఆలస్యం చెయ్య వద్దు. మీతో పదినిముషాలకన్నా ఎక్కువ మాట్లాడటం వీలుపడదు. వచ్చేందుకు వీలవుతుందా?" అడిగింది.

"వస్తాను! మీ వాలకం చూస్తే నా గురించి లేనిపోని అపోహాలు పెట్టుకొని నానుండి మిమ్మల్ని మీరు కాపాడు కునేందుకు చాలా జాగ్రత్తలు తీసుకొంటున్నట్లుగావుంది. మీకంత అనుమానంగానూ, భయంగానూ వుంటే నేను రాను లెండి. సునీల్ హత్యగురించి కావలసిన వివరాలు కొన్ని నేను వేరేవాళ్ళద్వారా సేకరించాను" అన్నాడు కాంత్.

"నో! నో! అలాంటిదేమీలేదు. చాలా బిజీగా వుండ డంతో ప్రొద్దున్న మీతో మాట్లాడే వీలులేకపోయింది. దానికి మరోవిధంగా ఆలోచించకండి. రెండింటికల్లారండి. ఎదురుచూస్తుంటాను" అంది గోముగా.

జరీనాకు తను అతన్ని అరెస్టు చేయించేందుకు పోలీసుల్ని పిలిపిస్తున్నదన్న విషయం తెలిసిందేమోనన్న అనుమానం కలిగింది. ఎలాగైనా అతన్ని రప్పించాలన్న ధ్యేయంతో కాస్త మురిపెంగా మాట్లాడింది.

"ఆల్ రైట్! మీరంతగా చెప్తుంటే రాకుంటే ఎలా? వస్తాను. కావాలంటే ఇంకా ముందుగానే వస్తాను. నాకు వేరే పనులేమీ లేవు."

"రావచ్చనుకోండి. నేను రెండింటికిగాని ఇల్లుచేరను.

అందుకని మీరు రెండింటికల్లా రండి. చాలు!" అంది జరీనా.

"అలాగే!" అని ఫోన్ పెట్టేశాడు.

7

జార్జి వాచీకేసి చూసుకున్నాడు. పన్నెండయింది.

దాదాపు తను అక్కడకొచ్చి ఒకటిన్నర గంటయింది. ఆ రోడ్ అంతా అటు ఇటు తిరుగుతూ తచ్చాడుతున్నాడు. కాళ్ళు లాగడం మొదలెట్టాయి. ఎండ ఎక్కువగా వుండటంతో ఒళ్ళంతా చెమట పట్టింది. వచ్చి హోటల్లో కూర్చున్నాడు.

వెయిటర్ రాగానే బన్ బటర్ తెమ్మన్నాడు. తెచ్చాక మెల్లగా ఒక్కొక్క ముక్క నములుతూ ఎదురుగావున్న ఇంటికేసి చూస్తూ కూర్చున్నాడు. బన్ తినేందుకు అరగంట పట్టింది. టీ తెప్పించుకున్నాడు. మెల్లగా సిప్ చేస్తూ, ఎదురుగా చూస్తూ మరో అరగంట గడిపాడు.

హోటల్లోని జనం వస్తూ పోతూనే వున్నారు. వెయిటర్ తనకేసి వింతగా చూడసాగాడు.

'అరణాల బిల్లుకు ఆరుగంటలు కుర్చీవదలడేమిట్రా?' అనుకుంటున్నాడేమో వెధవ అనుకున్నాడు జార్జి.

అయినా తను లేచి పోదలచుకోలేదు. అక్కడ్నుంచి ఎదురుగావున్న ఇల్లు బాగా కనుపిస్తుంది. పైగా మండు టెండ.

టెలిఫోన్ బూతులో కెళ్ళి కొలీగ్‌కు ఫోన్ చేసి అంతదాకా ఏవిధమైన ఆసక్తికరమైన సంఘటనలు జరగలేదని చెప్పాడు.

కాంత్, తను రెండింటికల్లా వచ్చేస్తాననీ తన్ను అతను కలుసుకోనవసరం లేదనీ, తను వెళ్ళాక అక్కడేవుండి, తన కోసం వచ్చే వ్యక్తులు ఎక్కడి కెళ్ళేదీ తెలుసుకోమని చెప్పాడు.

జార్జి సరేనని ఫోన్ పెట్టేశాడు.

పొడవుగావున్న లావుపాటి వ్యక్తి ఒకతనువచ్చి జరీనా ఇంటిముందు నిలబడ్డాడు. అతని ముఖం భయంకరంగావుంది. హత్యలు చెయ్యడంలో ఆరితేరిన వ్యక్తిలా తోచింది జార్జికి.

అతను రోడ్డు కొసదాకావెళ్ళి తిరిగొచ్చాడు. అంతలో మరో పొట్టిగావున్న దుబ్బువ్యక్తి రోడ్‌కి అవతలివేపునుండి వచ్చి పొడవుపాటి వ్యక్తిని కలుసుకున్నాడు.

ఇద్దరూ రెండుక్షణాలు ఏదో మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఇద్దరూ లోనికెళ్ళారు.

జార్జి ఇద్దర్నీ స్పష్టంగా చూశాడు. ఎంతమందిలోవున్నా తను వాళ్ళిద్దర్నీ సులభంగా గుర్తుపట్టగలననిపించింది.

జరీనా ఇంటి కిటికీకేసి దృష్టి సారించాడు. కర్టెన్ తప్పుకుంది. కిటికీ వెనకాల పొడవుపాటి వ్యక్తి కనుపించాడు. అంటే రోడ్డులో ఎవరన్నా తమను గమనిస్తున్నారేమో తెలుసుకోనేందుకే అతనలా చూస్తున్నాడని అర్థంచేసుకున్నాడు జార్జి.

ఆ పరిస్థితుల్లో తను వెలుపలకు వెళ్ళడం మంచిదిగాదనిపించింది.

వెయిటర్‌వచ్చి "క్యా సాబ్! ఆప్ ఇదర్ సే నై జాతే!" అడిగాడు విసుగ్గా.

"మా ఫ్రెండు వస్తానన్నాడు. ఇక్కడే కలుసుకుంటానన్నాడు. రెండుగంటలనుండీ వెయిట్ చేస్తున్నాను. ఇంకా రాలేదు. అతను రాగానే వెళ్తాను. మరో టీ పట్రా."

వెయిటర్ ఉషారుగా వెళ్ళిపోయాడు.

రెండు నిముషాల్లో టీకప్పు తెచ్చిపెట్టాడు. రూపాయి నోటుతీసి అతనికి అందించాడు. అతను చిల్లరతీసి ఇవ్వబోయాడు. వద్దని సైగచేశాడు. వెయిటర్ సెల్యూట్ కొట్టి సర్వ్ చేసేందుకు ప్రక్క టేబుల్ చుట్టూ అప్పుడేవచ్చి

కూర్చున్న వ్యక్తుల దగ్గరకు వెళ్ళిపోయాడు.

జార్జి టీ త్రాగి, సిగరెట్ వెలిగించుకొని టెలిఫోన్ బూత్ లోకి వెళ్ళాడు. ఆల్మండ్ హోటల్ నెంబరు డయల్ చేసి కనెక్షను రాగానే రూం నెంబరు 'మూడొందల మూడు' అన్నాడు.

"కాంత్ హియర్!" అన్నాడు అవతలవైపునుండి.

"నేను బాస్! జార్జిని!"

"ఏమిటి విశేషాలు!"

"ఇద్దరు హంతక శిఖామణులు ఇప్పుడే వచ్చారు. కాసేపు తచ్చాడి తిన్నగా జరీనా ఇంట్లో దూరారు. మీ రెక్కలు విరగ్గొట్టేందుకు లోపల సిద్ధంగా కూర్చుని వున్నారు" అన్నాడు జార్జి.

"గుడ్! ఇంకెవరన్నా వెలుపల వెయిట్ చేస్తున్నారా?"

"లేదు బాస్! ఇంతవరకూ నాకు కనిపించలేదు" అన్నాడు జార్జి.

"ఓమారు నువ్వు రోడ్ చివరంటా రెండువైపులా చూడు. కారేదైనా పార్క్ చేసి అందులో కూర్చుని చూస్తున్నారేమో గమనించు. ఆ తర్వాత సరిగ్గా నువ్వు ఒకటి యాభై నిముషాలకు ఫోన్ చెయ్యి" అన్నాడు కాంత్.

"అలాగే బాస్! మీరు ఆ యింట్లోకి వెళ్ళడం అంత క్షేమంగాదు. నేనుగూడా వస్తాను మీ వెంట. లోపలిద్దరున్నారు. మనం ఇద్దరముంటే మంచిదేమో ఆలోచించండి" అన్నాడు జార్జి.

"అవసరంలేదు; నే చెప్పినట్లు చెయ్యి" అన్నాడు కాంత్. వెంటనే ఫోన్ కట్ అయింది.

జార్జికి కాంత్ అంటే అందుకే గౌరవం. ప్రాణాలతో చెలగాటమాడే పనులన్నీ తనే నెత్తిన వేసుకుంటాడు. ప్రాణభయంలేని పనులే తన అనుచరులకు పురమాయిస్తాడు.

అంతకుముందు అతనితో ఐదారుసార్లు తను పని చేశాడు.

సీక్రెట్ ఏజంట్లందరిలోకి కాంత్‌కి మంచి పేరుంది. మృత్యువుతో చెక్కు చెదరని ధైర్యంతో పోరాడడం అతని హాబీ.

జార్జి హోటల్ వెలుపలికొచ్చి రోడ్ చివరిదాకా వెళ్ళాడు. కారుగానీ, వ్యాన్ గానీ ఏదీ కనుపించలేదు. అక్కడ్నుంచి రెండో చివరకు నడిచాడు. అక్కడా ఏమీ కనుపించలేదు. చివరనున్న పబ్లిక్ బూత్ నుంచిఫోన్ చేసి చెప్పాడు కాంత్‌కు.

ఆ తర్వాతవచ్చి జరీనా యింటి కెదురుగావున్న హోటల్ నానుకునివున్న కిళ్ళీకొట్టు దగ్గర సిగరెట్ త్రాగుతూ నిల బడ్డాడు. అతని రెండో చెయ్యి ఆటోమేటిక్ నైఫ్ మీదుంది.

కాంత్ వెళ్ళాక పదినిముషాలు చూడదలచుకున్నాడు. ఆలోగా అతను వెలుపలికి రాకుంటే తను వెళ్ళి లోపలున్న ఇద్దర్నీ నరికి పోగులుపెట్టి రాదలచుకున్నాడు.

వాచీకేసి చూస్తూ కూర్చున్నాడు బెంచీమీద సిగరెట్ వడివడిగా దమ్ములాగుతూ.

8

తలుపు తట్టగానే ఒక్క ఉదుటున వచ్చి జరీనా తలుపు తీసింది.

లావుపాటి పొడవైన వ్యక్తి, అతని ప్రక్కనేవున్న పొట్టిగా వున్న గుబ్బుమనిషి ప్రత్యక్షమైనారు.

"ఎవరు మీరు?" అడిగింది జరీనా.

"పోలీసులం. మా ఆఫీసరు పంపారు."

"లోనికి రండి!" అంటూ దారితీసింది.

వాళ్ళ మొఖాలు చూడంగానే భయపడింది జరీనా. తను నగరంలో ఎంతోమంది పోలీసుల్ని నిత్యం చూస్తూనేవుంది. వీళ్ళ ముఖాల్లోవుండే క్రౌర్యం, కాఠిన్యం, వాళ్ళల్లో కను

పించలేదు. వీళ్ళను చూస్తే హంతకుల్లాగాను, దొంగల్లాగాను వున్నట్లనిపించింది. ఒకవేళ స్పెషల్ పోలీసులేమో ననుకుంది.

గూఢచారిని పట్టుకునేందుకు వచ్చినవాళ్ళు కాబట్టి, కాస్త గట్టివాళ్ళుగా వుండాలని, తన్ను కలుసుకున్న ఆఫీసరు ఏరి ఏరి పంపాడేమోనని తన్నుతానే సమాధాన పరచుకుంది.

లోపలికి రాగానే పొడవుపాటి వ్యక్తి, గబగబ కర్టెన్ల వెనుక, బాత్‌రూంలో, లెట్రిన్‌లో, మిగిలిన గదుల్లో ఏమేమో వెతకసాగాడు. పొట్టిగావున్న దుబ్బుమనిషిమాత్రం హాల్లోనే నిలబడ్డాడు.

"ఏమిటతను వెతికేది?" అడిగింది జరీనా.

"మీకు తెలీకుండా ఎవరైనా విరోధులు ముందే లోనికి దూరారేమోనని చూస్తున్నాడు."

"అది అసంభవం! నన్నడిగితే చెప్పేదాన్నిగా" అంది జరీనా.

అంతలో ఆ పొడవు వ్యక్తి వచ్చేశాడు హాల్లోకి.

"మేడమ్ మా ఆఫీసరుగారు మీకంతా చెప్పారనుకుంటాను" అన్నాడు.

"ఆఁ!" అంది జరీనా.

"ఆ వచ్చేవాడు అసాధ్యుడు. అందులో శత్రుదేశపు గూఢచారి. వాళ్లు హత్యలు చేసేందుకు, ప్రాణాలు తీసేందుకు, వెనుకాడరు. అతనితో తలపడి, కొట్టి, కట్టి, బంధించి అరెస్టు చెయ్యవచ్చు. కానీ దానివల్ల వీధంతా తెలిసిపోని అల్లరి అవుతుంది. జనం గుమిగూడుతారు. అది మా ఆఫీసరుకు ఇష్టంలేదు" అన్నాడు పొడవుపాటి వ్యక్తి.

"అయితే ఎలా అరెస్టు చేస్తారు!"

"ఇదిగో విస్కీ బాటిల్. దీంట్లో గార్డినాల్ టేబ్లెట్లు కరిగించాం. అతను రాగానే, అతనికందు నువ్వు బాటిల్

ఓపెన్ చెయ్యి. అతనికా గ్లాసు ఇచ్చి, అతనికి అనుమానం రాకుండా నువ్వుకూడా త్రాగు. వెంటనే అతను స్పృహ తప్పిపోతాడు. మేము అతన్ని అరెస్టుచేసి తీసుకెళ్తాం'' అన్నాడతను.

''నేను త్రాగితే నాక్కూడా స్పృహపోతుందిగా?'' అడిగింది జరీనా.

''పోతుంది. మేము వెళ్ళిపోతాం. అరగంటలో నీకు మైకం వదులుతుంది. అంతకన్నా మరేం వుండదు''అన్నాడు.

''అతన్ని తీసుకెళ్ళేందుకు పోలీస్ వాన్ తీసుకొచ్చారా?'' అడిగింది జరీనా_ తనకు అలాంటిదేమీ కథలో కనిపించక పోవడంతో.

''దాన్ని తెచ్చి ఇంటిముందు పెడితే వచ్చేవ్యక్తి దాన్ని చూసి తనకోసం వలవిసిరి వుంచారని తెలుసుకొని లోనికి రాకుండానే వెళ్ళిపోతాడు. అందుకని తేలేదు. అతనికి స్పృహపోగానే ఆఫీస్ కి ఫోన్ చేస్తాం. పదినిముషాల్లో వాన్ వస్తుంది. అతన్ని అందులో వేసుకునిపోతాం'' అన్నాడు పొట్టిగావున్న దుబ్బుమనిషి.

''అవును అదీ నిజమే! ఆ బాటిల్ ఇలా తే!'' అంది. అతను బాటిల్ అందించాడు. తీసుకొని టీపాయ్ పైన పెట్టింది.

''నేను బాత్ రూంలో దాక్కుంటాను. అతను అదిగో ఆ రూం కర్టెన్ వెనకాతల వుంటాడు. నీకేం భయం వుండదు. చెప్పిందిమాత్రం మరచిపోవద్దు'' అన్నాడు పొడవుగా వున్న మనిషి.

''ఆల్ రైట్! మీరు మీ మీ స్థానాలకు వెళ్ళిపొండి. గంట రెండవుతోంది. అతను వచ్చేస్తాడు ఏ క్షణంలో నయినా'' అంది జరీనా. వాళ్ళిద్దరూ దాక్కునేందుకు వెళ్ళి పోయారు.

జరీనా బయటకు, లోపలకు తిరుగసాగింది. తలుపులు దగ్గరగా వేసి పెట్టింది. టీపాయిపైన విస్కీసీసా పెట్టింది. దానిప్రక్కన రెండుగ్లాసులుగూడా పెట్టింది.

అతను రాగానే ఎలా మాట్లాడాలో, అతను త్రాగనంటే ఎలాంటి మాటలుచెప్పి, అతనిచేత తాగించాలో ఆలోచించుకుంటూ కూర్చుంది.

బయట ఏదో కారాగిన శబ్దమైంది. ఇంజెన్ మాత్రం రొద పెడుతూనేవుంది. పిజిన్ హోల్ గుండా చూసింది. అతనే! ప్రొద్దున్న వచ్చిన వ్యక్తే స్టీరింగు దగ్గరున్నాడు. క్రిందికి దిగాడు. తలుపుని తెరచే వుంచాడు.

ఆరడుగుల ఆజానుబాహు విగ్రహం. తెల్లటి సూట్ లో వున్నాడు. నల్లటి గాగుల్స్ పెట్టుకున్నాడు. మంచి అందగాడే ననుకుంది.

కాంత్ కారు దిగి జరీనా ఇంటిముందు నిలబడ్డాడు.

మెల్లగా జేబులోవున్న 'వెస్సన్' రివాల్వరుతీసి చేతిలో పెట్టుకున్నాడు. రోడ్ ను కలయచూశాడు. నిర్మానుష్యంగా వుంది. ఎదురుగావున్న హోటల్ లోమాత్రం నలుగు రైదుగురు మనుషులున్నారు.

చటుక్కున వెనక్కి తిరిగి తలుపు తట్టాడు.

ఒక్కక్షణం తర్వాత జరీనా తలుపు తెరచింది. ఒక చెయ్యి బైటపెట్టి, తల వెలుపలకువంచి తొంగిచూసి నవ్వింది.

వెలుపల తలుపుపైన పెట్టిన చెయ్యిని తన ఎడంచేత్తో పట్టుకొని కుడిచేతిలోవున్న రివాల్వర్ ను ఆమె గుండెల కానించాడు. నల్లటి రివాల్వరు చల్లగా ఆమె ఎడం రొమ్ముకు తగలగానే బిక్కచచ్చిపోయింది.

"అరిస్తే కాలుస్తాను! రా!" అంటూ వెలుపలకు లాగాడు.

ఆమె తలుపు ఇవతలవేపు పడగానే, తలుపుమూసి గొళ్ళెం బిగించాడు. ఆమెను లాక్కుపోయి తెరచి వుంచిన

తలుపుద్వారా కారు ముందు సీట్లోకి స్టీరింగు వీలు ప్రక్క నుండి తోసి, తను ఒక్క గెంతులో ఎక్కి కూర్చున్నాడు. ఇంజన్ ఆడుతూనే వుంది.

తలుపు మూసుకుని, ఆక్సిలేటర్ నొక్కాడు. కారు ఎగిరి దూకింది. చకచక గేర్లుమార్చి, ఆక్సిలేటరు పూర్తిగా తొక్క గానే అరవై మైళ్ళ స్పీడందుకుంది. కన్నుమూసి తెరచేలోగా కారు ఆల్మండ్ హోటల్ చేరుకుంది.

"నీకేం భయంలేదు. నన్ను చంపించేందుకు నువ్వు సిద్ధం చేసిన పథకం నాకు తెలిసనుకున్నావా. నన్ను చంపేందు కొచ్చిన ఇద్దర్నీ చంపడం నాకు కష్టంగాదు. కానీ నీ ఇంట్లో పెద్ద సీను సృష్టించడం ఇష్టంలేదు. నిన్ను రక్షించడం నా కర్తవ్యం. అందుకే ఇలా బలవంతంగా లాక్కొచ్చాను. నా రూంకు రా. అన్నీ నీకు వివరించి చెబుతాను" అన్నాడు కాంత్.

జరీనా తనుతిన్న షాక్ నుంచి తేరుకోలేదు. కాంత్ ను ప్రతిఘటించడం ఇష్టంలేదు. తాము తెలివిగా తయారుచేసిన పథకాన్ని వమ్ముచేసిన మనిషి, తన్ను చంపడం పెద్ద విచిత్రం గాదన్న నమ్మకం కలిగిందామెకు. అందుకే నోరు మెదపక అతనివెంట ఎలివేటర్ ఎక్కి రూంకు వెళ్ళింది.

9

జార్జి కారువచ్చిన అలికిడికాగానే తలెత్తి చూశాడు. స్టీరింగుముందు కూర్చున్న కాంత్ కనుపించాడు. హుషారుగా లోలోపలే ఈలవేసుకున్నాడు.

కారు తిన్నగా రోడ్ చివరంటవెళ్ళి టర్నయి తిరిగివచ్చి జరీనా ఇంటి ముందాగింది.

ఇంజన్ ఆఫ్ చెయ్యకుండా ఫ్రంట్ డోర్ తెరచివుంచి పోతున్నప్పుడే బాస్ ఏదో పెద్ద పథకం వేశాడనుకున్నాడు

జార్జి. కన్నుమూసి తెరచేలోగా జరీనాతో సహా కారెక్కి దూసుకుపోయాడు కాంత్.

"హేట్స్ ఆఫ్ టు యువర్ బ్రిల్లియన్స్!" అనుకున్నాడు పెద్దగా పైకి.

తనకు ఫోన్లో చెప్పిన పని గుర్తొచ్చింది. తన పని ఇంక ప్రారంభమవుతుంది. జరీనా ఇంట్లోవున్న వెధవల్ని తను అనుసరించి వెళ్ళాలి. వాళ్ళు ఎక్కడికి పోతారో తెలుసుకోవాలి. సిద్ధంగా కాచుకుని వున్నాడు.

పదినిముషాల తర్వాత ఒక తలుపు విరిగి వెలుపలకు పడటం గమనించాడు జార్జి. లావుపాటి పొడివు మనిషి ముందు దూకాడు. అతని అనుచరుడు వెనకదిగాడు. ఇద్దరూ రోడ్ కేసి అటూ ఇటూ చూసి తిన్నగా రోడ్ దాటి హోటల్ లోకి వెళ్ళారు.

జార్జి కదలకుండా కిళ్ళీకొట్టు దగ్గరే కూర్చున్నాడు. తను కూడా లోనికి వెళ్దామనుకున్నాడు. ఒకవేళ వెయిటర్ గురించి మీ ఫ్రెండు ఇంకా రాలేదని అడిగితే ఆ ఇద్దరూ తన్ను అనుమానించ వచ్చన్న భయంతో లోనికివెళ్ళే ప్రయత్నం మానుకున్నాడు.

ఏంచేస్తున్నారో చూడాలన్న ఆతృత కలిగింది జార్జికి. హోటల్ వైపు చూస్తూ దాటిపోయాడు. పొట్టివాడు కూర్చుని టీ తాగుతున్నాడు. పొడవుపాటి మనిషి బహుశా ఇక్కడ జరిగిన విచిత్రం ఫోన్ లో తన బాస్ కు చెప్తున్నాడేమో ననుకున్నాడు. మళ్ళా వెనక్కి రాకుండా ఇంకొంత ముందుకు పోయి నిలబడ్డాడు జార్జి. వీళ్ళిద్దర్నీ ఎలాగైనా తన కత్తితో చంపేందుకు నిర్ణయించుకున్నాడు.

రెండు నిముషాల తర్వాత ఇద్దరూ తనవైపే రావడం గమనించాడు.

తన్ను అనుమానించారేమో ననుకుని చెయ్యి పాంట్

జేబులో పెట్టి కత్తి పిడి పట్టుకొని, బొటనవేలుని బటన్ పైన పెట్టాడు, వాళ్ళలో తలపడేందుకు సిద్ధంగా.

ఇద్దరూ ఏదో మాట్లాడుకుంటూ జార్జిని దాటి ముందుకు వెళ్ళిపోయారు.

జార్జి కూడా దూరంగా వాళ్ళను అనుసరించాడు. రోడ్ చివర్న టాక్సీ ఆపి ఎక్కారు ఇద్దరూ. గబగబ నెంబరు మనసులో నోట్ చేసుకున్నాడు. ముందు టాక్సీ కదిలివెళ్ళింది. వెనుక మరో కారొచ్చింది. అది రివ్వున దూసుకుపోయింది. దాని వెనుక టాక్సీ వచ్చింది. ఖాళీగా కూడా వుంది. ఆపాడు జార్జి. టాక్సీ ఆగింది. ఎక్కి కూర్చున్నాడు.

“సార్! ఇంటికి అన్నానికి పోతున్నాను సార్” అన్నాడు తను రాలేనన్నట్లు.

“చాలా అర్జంటు. ఇద్దరు దొంగలు ముందు టాక్సీలో పోతున్నారు వాళ్ళను పట్టుకోవాలి. నీకు ఫేర్ పైన మరో పదిరూపాయలిస్తాను. పద. క్విక్!” అన్నాడు.

పదిరూపాయల మాట వినగానే టాక్సీ కదిలించాడు డ్రైవరు. రివ్వున దూసుకు పోయింది. తనకు కావలసిన టాక్సీ నెంబరు చెప్పాడు జార్జి.

రకరకాల రోడ్లు చుట్టుకొంటూ టాక్సీలు రెండూ రింగ్ రోడ్ లో దూరాయి.

ముందున్న టాక్సీ ఒక పుస్తకాల షాపు ముందాగింది. దానికి కొంత దూరంలో జార్జి టాక్సీని ఆపమని డబ్బిచ్చి పంపేశాడు.

ఆగంతకు లిద్దరూ టాక్సీదిగి షాపులోకి వెళ్ళారు.

10

జార్జి పుస్తకాల షాపుదాకా నడచి వెళ్ళాడు. షాపులో కొంతమంది జనం వున్నారు.

జార్జి గూడా లోనికి దూరాడు. రాక్స్‌లోవున్న పుస్తకాలను పరిశీలిస్తూ చూడసాగాడు. రెండు పుస్తకాలు తీసుకుని కౌంటర్ దగ్గర కొచ్చాడు. ఆ ఇద్దరూ లోపల కనుపడలేదు. అంటే ఏదైనా రహస్య మార్గం వుండివుండాలనుకున్నాడు.

డబ్బులిచ్చి "ఫోన్ చెయ్యాలి" అన్నాడు.

"బాస్ మాట్లాడుతున్నట్లున్నారు. ఐదునిముషాలాగండి" అన్నాడు అతను.

"మీ బాస్ మేడమీదుంటారా?" అడిగాడు.

"లేదండీ! ఆ రాక్స్ మధ్యనుంచిపోతే వెనుక చిన్న రూం వుంది. ఆయన అక్కడే వుంటారు" అన్నాడు చిల్లర తిరిగి ఇచ్చేస్తూ.

మరో రెండు నిముషాలాగాడు.

"మీ బాస్ మాట్లాడటమయిందా?" అడిగాడు జార్జి.

కౌంటర్‌లో వున్న వ్యక్తి ఇన్‌స్ట్రుమెంటుకేసి చూసి "లేదండీ! ఇంకా మాట్లాడుతూనే వున్నారు" అన్నాడు.

"ఆల్ రైట్! నేను మరో చోటినుండి ఫోన్ చేసుకుంటాలెండి. థాంక్స్!" అంటూ వెలుపల పడ్డాడు.

షాపు కెదురుగా పార్క్ చేసిన ఫియట్ కారు చూశాడు. దాని నెంబరు తనుకొన్న పుస్తకంపైన రాసుకున్నాడు. ఆ కారు వాళ్ళదే అయివుండాలనిపించింది.

ఐదునిముషాల తర్వాత కారు బయలుదేరింది. జార్జి గూడా ఒక టాక్సీ మాట్లాడుకుని ముందుకుపోతున్న కారుని అనుసరించ సాగాడు.

ముందున్న కార్లో ప్రస్తుతం ముగ్గురు వ్యక్తులున్నారు. క్రొత్తగా చేరిన వ్యక్తి డ్రైవ్ చేస్తున్నాడు. కారును అనుసరించి వందగజాల వెనుకగా జార్జి ఎక్కిన టాక్సీ మెల్లగా పోసాగింది.

ముందున్న వాళ్ళు తమ స్థావరానికి పోతుండాలనిపించింది

జార్జికి. దాన్ని తను గుర్తుపట్టి వెంటనే కాంటాక్ట్ తెలిపితే, యుద్ధం ప్రారంభించవచ్చు ననుకున్నాడు జార్జి. ప్రయోజనకరమైన పని తనుగూడా చెయ్యగలిగినందుకు సంతోషంగా వుందతనికి.

రెండు వాహనాలు ఊరుదాటాయి. మరో ఐదుమైళ్ళు పోయాయి. కారాగిపోయింది. టాక్సీనిగూడా ఆపేశాడు. ముందున్న కారు రివ్వుమంటూ వెనక్కి వచ్చింది. జార్జి తను ఏం చెయ్యాలో నిర్ణయించుకోనే లోగానే కార్లో వున్న వ్యక్తులు టాక్సీ ముందు టైర్లని రెండింటిని పేల్చి పారేశారు.

జార్జి టాక్సీ తలుపుతీసి దిగబోయాడు. తుపాకీ గుండురివ్వుమని దూసుకుపోయింది. తలుపు మూసుకొని కూర్చున్నాడు.

డ్రైవరు ఏడుపు ముఖం పెట్టాడు.

కార్లోంచి ముగ్గురూదిగి కిందికి నడిచారు. ముగ్గురి చేతుల్లో రివాల్వర్లు నిప్పులు కక్కేందుకు సిద్ధంగా వున్నాయి.

"ఏమిటి సార్ ఇదంతా!" అడిగాడు డ్రైవరు.

"యుద్ధం!"

"టాక్సీ కావాలని ఫోన్ చేస్తే వచ్చాను సార్! ఈ గందరగోళం నాకు తెలీలేదు!" అన్నాడు డ్రైవరు.

"ఫోన్ చేశారా? ఎవరు?"

"ఏమో సార్! 'వెంటనే పరిస్తాన్ బుక్ కంపెనీ ముందుకు టాక్సీ పంపండి' అని చెప్పి టాక్సీ నెంబరుగూడా చెప్పించుకున్నారు సార్ ఫోన్లో."

"మరి నువ్వు అక్కడ నన్నడగలేదే?"

"మీరు హడావిడిలో వున్నారు. మీరే ఫోన్ చేశారనుకున్నాను."

ప్రత్యర్థులు తెలివిగా తన్ను బంధించారనుకున్నాడు జార్జి. తనదగ్గర రివాల్వరు లేదు. పైగా ఒంటరిగాడు. వాళ్లు ముగ్గురు. వాళ్ళతో తలపడడం ప్రాణాలు తీసుకోవడమే తప్ప ప్రయో

జనం లేదనిపించింది. తను ఎటు వెళ్ళిందీ కాంత్ కు చెప్ప లేకపోతున్నానన్న బాధ ఎక్కువైంది.

మరోనిముషంలో ముగ్గురూ టాక్సీని చుట్టుముట్టారు.

జార్జి క్రిందకు దిగాడు. డ్రైవరునికూడా దిగమన్నారు. అతనుకూడా దిగాడు.

జార్జి జేబులోవున్న కత్తి తీసేసుకున్నారు. ఇద్దర్నీ నడిపించుకు వెళ్ళారు ముందు కారుదగ్గరకు. వెనుకసీట్లో ఇద్దర్నీ మధ్య కూర్చోపెట్టుకున్నారు.

కారు ముందుకు వెళ్ళి కుడివేపుతిరిగి, ఒక పాడుపడ్డ బంగళావద్దకు వెళ్ళి ఆగింది. అంతకుముందే అక్కడో పాడు గాటి కారు పార్క్ చేసివుంది.

"బాస్ ఇక్కడే వున్నారా?" అడిగాడు పాడుగాటి వ్యక్తి.

"ఆఁ! అందర్నీ ఇక్కడకే రమ్మన్నారు. మీకు చాలా పనుంటుంది."

అన్నాడు మూడో వ్యక్తి. అతనే వహీద్.

అందరూ కారుదిగి బంగళాలోకి వెళ్ళారు.

11

"కూర్చోండి!" అన్నాడు కాంత్ జరీనాను.

జరీనా కూర్చుంది.

రూం సర్వీస్ కు ఫోన్ చేసి రెండు కాఫీలు తెమ్మన్నాడు. రెండు నిముషాల్లో కాఫీలు వచ్చాయి. ఇద్దరూ త్రాగారు.

"మేడమ్! ఇవిగో నా గుర్తు పత్రాలు. నేను ఇండియా ఏజంటునని ధృవపరిచే కాగితాలు ఇవిగో. ఈ వీసా చూడు. ఇవన్నీ చూశాక నేను సునీల్ కుమార్ కు విరోధిని గానని, అతని మిత్రుణ్ణనీ నీకు తెలుస్తుంది!" అన్నాడు.

జరీనా అలాంటి కాగితాల్ని సునీల్ దగ్గరకూడా అంతకు

ముందు చూచివుండటంతో, కాంత్ చూపించిన కాగితాల్ని సులభంగానే గుర్తుపట్టింది.

"మరి వాళ్లు అలా చెప్పారే?" విస్తుపోతూ అడిగింది జరీనా.

"ఏమిటి చెప్పారు?" అడిగాడు కాంత్.

అంతా వివరంగా చెప్పింది.

"నన్ను అరెస్టు చేసేందుకు వచ్చేవాళ్ళు నిజంగా పోలీసులయితే భయపడవలసిన అవసరం వాళ్ళకేముంది. ఇద్దరికి నేను అలివిగానసుకుంటే పదిమందిని పంపివుండేవాళ్ళు కదా. విస్కీలో నిద్రమాత్రలు కలిపామని నీవు చెప్పారు. కానీ నా అనుమానం అందులో విషం కలిపి వుంటారు. మనిద్దరం త్రాగి చనిపోతే వాళ్ళకింక ఎదురులేదు. మన శవాల్ని అక్కడే వదిలేసి పోయేవాళ్ళు. మన బట్టలు విప్పి, క్రైమ్‌గా సృష్టించి వుండేవాళ్ళు!" అన్నాడు కాంత్.

"అవును. నా కనుమానంగానే వుండింది. అడిగాను. వాళ్లు ఏదో సమాధానం చెప్పారు. అప్పట్లో వాళ్ల సమాధానం కరెక్టుగానే తోచింది. మీరు ఎలా అనుమానించారు?" అడిగింది జరీనా.

"నువ్వు నాతో మాట్లాడేందుకు తర్వాత రమ్మన్నావు. నన్ను వెళ్ళిపొమ్మని బ్రతిమిలాడావు. పైగా అంతకుముందే ఎవరో వచ్చి నీతో మాట్లాడి వెళ్ళారని నీ మాటలవల్ల కనిపెట్టాను. దీన్నిబట్టి అనుమానమేసింది. నా అసిస్టెంటును నీయిల్లు పహారా కాయమని పురమాయించాను. అతని ద్వారా నీ యింట్లోకి ఇద్దరు ఆగంతకులు ముందుగానే వచ్చినట్లు తెల్సుకున్నాను. వెంటనే పథకం మార్చుకున్నాను. వాళ్లు ఊహించని విధంగా నిన్ను అక్కడ్నుంచి లాక్కొచ్చాను. అందువల్లే ఇద్దరం బ్రతికాం!" అన్నాడు కాంత్.

"ఇదంతా ఎందుకు చేస్తున్నట్లు?"

"నీకేం తెలీదా?"

"తెలీదు!"

"సునీల్ ఏమీ చెప్పలేదా?"

"లేదు. అర్జంటు పనులంటూ వెళ్ళేవాడు. వచ్చేవాడు. అంతే!"

"ప్రఖ్యాత సైంటిస్టు ప్రేమనాథ్ డో గ్రేని ఈ ముఠా మా దేశంనుండి తస్కరించుకొచ్చింది. ఆయన్నెక్కడో దాచి పెట్టింది. అతన్ని విడిపించేందుకు మా గూఢచారి దళం రంగంలో కురికింది. కానీ ప్రత్యర్థి కూటమి తెలివిగా ఇప్పటికి ఇద్దరు ఏజంట్లను, వాళ్ళతోపాటు మాకు సాయంచేసిన మరో నలుగుర్ని చంపింది. దాంతో నన్ను పంపారు" అన్నాడు కాంత్.

"ఆయనెక్కడున్నాడో తెలిసిందా?"

"తెలుస్తుంది."

"నన్ను నీ ద్వారా సులభంగా చంపగల ననుకున్నారు. అది ఫెయిల్ కాగానే వాళ్ళకు చెమటలు క్రమ్ముతాయి. ఇప్పుడు ఎంత ఘోరానికైనా తలపడతారు. వాళ్ళ హడావుడిలో తమ రహస్యాల్ని తామే బైటపెట్టుకొంటారు" అన్నాడు కాంత్.

ఫోన్ మ్రోగింది.

"నా అసిస్టెంటు. విరోధి కూటమి ఎక్కడుంది కనుక్కొని చెప్పమన్నాను. చెప్పేందుకు ఫోన్ చేస్తున్నట్లున్నాడు" అన్నాడు కాంత్ రిసీవరు తీసుకుంటూ.

"హల్లో!"

"ఈజిట్ మిస్టర్ కాంత్" అడిగారు అవతలవేపు నుండి.

"యస్. మీ రెవరు?"

"నీ కొలిగుళ్ళం. నీ అసిస్టెంటు జార్జి మాకు పట్టుపడ్డాడు."

"నో. నేను నమ్మను."

"అయితే అతనితో నే మాట్లాడు."

క్షణం తర్వాత.

"నేనే బాస్ జార్జిని మాట్లాడుతున్నాను" అంటూ జార్జి కంఠం వినిపించింది.

కాంత్ లేచి నిలుచున్నాడు.

"నువ్వా! వాళ్ళకెలా చిక్కావ్?"

"మోసపోయాను బాస్!" అంటూండగానే అతని మాటలు వినపడడం ఆగిపోయింది. మళ్ళీ మొదటివ్యక్తే ఫోన్లో కొచ్చాడు.

"విన్నావా?"

"ఆఁ!"

"అతన్ని ప్రాణాలతో పంపకుంటావా?"

"అంత మంచితనం మీకుందని నాకు నమ్మకంలేదు."

"ఉండదు. మనదంతా ఒకే కులంగదా! అతన్ని ప్రాణాలతో పంపుతాను. కానీ జరీనాను నాకు అప్పగించాలి."

"ఆమె ఎందుకు?" అడిగాడు కాంత్.

"అవన్నీ నీ కనవసరం."

"ఆల్ రైట్! కానీ మాట తప్పగూడదు."

"తప్పం!"

"ఎక్కడకు తీసుకు రమ్మంటారు?"

"ఊరవతల దక్షిణంగా ఐదుమైళ్ళు రా. ఐదో మైలు రాయి దగ్గరనుంచి కుడివేపు అర మైలు వచ్చావంటే అక్కడ పాతబంగళావుంది. అందులో వున్నాడు నీ అసిస్టెంటు. జరీనాను తీసుకురా!" అంటూ ఫోన్ కట్ చేశాడు అవతలి వ్యక్తి.

తన సంభాషణ సారాంశం వివరించి చెప్పాడు జరీనాకి కాంత్.

"అయితే నన్ను వాళ్ళకు అప్పగిస్తావా?" అడిగింది జరీనా.

"నాలో ప్రాణాలున్నంతదాకా అది జరుగదు" అన్నాడు కాంత్ దృఢనిశ్చయంతో.

12

డోగ్రే ఆకారం భయంకరంగావుంది. అతన్ని కొరడాతో కొట్టారు. కత్తితో గాట్లు పెట్టారు. తలవెంట్రుకలు బలంగా పీకారు. బట్టలన్నీ చించారు.

జార్జి చూస్తూ నిల్చున్నాడు. మొత్తం ఎనిమిదిమంది వున్నారు. కాంత్ తోడుంటే అందర్నీ ఖర్మాచేసి వుండే వాడు.

అంత చేసినా డోగ్రేమాత్రం ఫార్ములా చెప్పనని మొరాయిస్తూనే వున్నాడు.

"మిస్టర్ డోగ్రీ! దేశం విడిపోకముందు లాహోర్ యూనివర్సిటీలో పనిచేస్తున్నప్పుడు నువ్వు షర్మిలా అనే ఆమెను ప్రేమించావు. గుర్తుందా?" అడిగాడు వాల్టర్.

"ఆం!"

"ఆమెకు నీవల్ల గర్భం వచ్చింది. ఆ తర్వాత నువ్వు ఇండియాకు వెళ్ళావ్. ఆమె ఆడపిల్లని కని చనిపోయింది. ఆ పిల్ల పెరిగి పెద్దదయింది. ఆమే జరీనా. మరో అరగంటలో ఇక్కడికొస్తుంది. నీముందే ఆమెను నా అనుచరులు మాన భంగం చేస్తారు. చూస్తూ సహిస్తావో, ఆ ఘోరం జరగకుండా ఆ ఫార్ములా మాకు చెప్తావో నిర్ణయించుకో!" అన్నాడు వాల్టర్.

"నీ మాటలు నేను నమ్మను."

"ఈ ఫోటోలు నమ్ముతావా?" అంటూ షర్మిల, డోగ్రే తీయించుకున్న ఫోటోలు, ఆ తర్వాత, షర్మిల, జరీనా తీయించుకున్న ఫోటోలు కళ్ళముందు పెట్టాడు వాల్టర్.

డోగ్రేకు నమ్మక తప్పలేదు.

వెలుపల కారాగిన చప్పుడైంది.

"మన దోస్త్ వచ్చినట్లున్నాడు" అన్నాడు వహీద్.

"జార్జి కట్లువిప్పండి" అన్నాడు వాల్టర్.

"అయితే బాస్ మనం వీడ్ని నిజంగా అప్పగించాల్సిందేనా?"

"జరీనా మనవైపు రాగానే మీరు ఇద్దర్నీ కాల్చిపారేయ్యండి" అన్నాడు వాల్టర్.

వహీద్ తన అనుచరులిద్దర్నీ వెంటబెట్టుకొని బంగళా వెలుపలకు వచ్చాడు. వెంట జార్జిగూడా వున్నాడు.

ఎదురుగా జరీనా మాత్రమేవుంది.

"వాడు రాలేదా?" అడిగాడు వహీద్.

అంతలోనే తలుపువారగా గోడకానుకుని నిలుచున్న కాంత్ చేతిలోవున్న రివాల్వరు నిప్పులు కురిపించింది. వహీద్, అతని అనుచరులిద్దరూ 'అబ్బా,' అంటూ వరుసగా నేల కూలిపోయారు. జార్జి కత్తి చేతికి తీసుకున్నాడు. జరీనా రివాల్వరు బొమ్మల మధ్యనుండి వెలుపలకు తీసింది.

"ఎంతమందున్నారు?" అడిగాడు కాంత్.

"మరో ఐదుగురున్నారు. బాస్ గాడుగూడా వున్నాడు."

"నేను వాడిసంగతి చూస్తాను. మీ రిద్దరు మిగిలిన వాళ్ళను చూచుకోండి" అన్నాడు కాంత్.

జరీనా తండ్రే ప్రేమనాథ్ డోగ్రే అన్న సంగతి చెప్పాడు జార్జి. ఆమె విస్తుపోయింది. తన తండ్రిని ఎలాగైనా రక్షించుకోవాలన్న ఆకాంక్ష బలీయంగా కలిగిందామెకు. తలుపుత్రోసుకుని జరీనా ముందు లోనికెళ్ళింది.

"రా! నీకోసం ఎదురుచూస్తున్నాను" అన్నాడు వాల్టర్.

జరీనా చీరచాటున రివాల్వరును వుంచుకుంది. వాల్టర్ ఆమె రెక్క బట్టుకొని లోనికి లాక్కెళ్ళాడు. తిన్నగా డోగ్రే దగ్గరకు తీసుకువెళ్ళాడు.

"ఇదిగో నీ కూతురు" అంటూ జరీనాను డోగ్రేపైకి తోశాడు. జరీనా పైన పడగానే తనచేతిలోవున్న రివాల్వరును తండ్రిచేతిలో పెట్టింది.

"ఆమె శీలం పోకముందే ఫార్ములా మాకు చెప్పు" అరిచాడు వాల్టర్.

"నాన్నా! చెప్పొద్దు! నాకేమైనా ఫర్వాలేదు!" అంది జరీనా.

వాల్టర్ ఆమెను వెనక్కిలాగి చెంపమీదచాచి కొట్టాడు. దెబ్బకు జరీనా వెళ్ళి దూరంగా పడింది. డోగ్రే చేతిలో వున్న రివాల్వరు పేలింది. వాల్టర్ గుండెల్లోంచి చీల్చుకు పోయింది.

మిగిలిన నలుగుర్నీ మట్టుబెట్టి లోనికొచ్చిన కాంత్, జార్జి తమముందు నేలకూలిన వాల్టర్ను చూడగానే విస్తుపోయారు.

"యూ! త్రీనాట్ త్రీ!" అన్నాడు వాల్టర్ క్రిందనుండి కాంత్ను చూసి.

"అవును. నేనే! మా సైంటిస్టును బలవంతంగా ఎత్తుకొచ్చిన నీవు ఆ సైంటిస్టు చేతిలోనే చచ్చావ్. మీ బలగం మొత్తం నాశనమైంది" అన్నాడు కాంత్.

వాల్టర్ కళ్ళుమూశాడు.

జరీనా డోగ్రే కట్లువిప్పింది. తండ్రీ కూతుళ్ళిద్దరూ గాఢంగా కౌగలించుకున్నారు.

"మిస్టర్ కాంత్! నన్ను కాపాడడమేగాక మా తండ్రిని

నాకు చూపించారు. మీకు నేను కృతజ్ఞురాల్ని!'' అంది జరీనా.

''ఇది నా డ్యూటీ!'' అన్నాడు కాంత్.

''ఈ కత్తి కడుక్కొంటే బాగుండును. నీళ్లెక్కడున్నాయో?'' అన్నాడు జాక్రి.

''ఎంతమందిని పొడిచావ్?'' నవ్వుతూ అడిగాడు కాంత్.

''ముగ్గుర్నే సార్! అవీ చిన్న చేపలు'' అన్నాడు జాక్రి కూడా నవ్వుతూ.

నలుగురూ ఆనందంగా బయటికి నడిచారు.

— : ఐపోయింది : —